సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
24 ఆగస్టు 2024
పేజీలు: 02

THANK YOU SHIKHAR DHAWAN

# క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ధావన్




## 14 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలికిన గబ్బర్

### రిటైర్మెంట్ తెలుపుతూ వీడియో విడుదల

దేశీయ, అంతర్జాతీయ క్రికెట్‌కు శిఖర్ ధావన్ గుడ్‌బై చెప్పారు. 14 ఏళ్ల కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. సోషల్ మీడియా పోస్టు ద్వారా ధావన్ తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పంజాబ్ కింగ్స్ తరపున ఐపీఎల్‌లో చివరి టోర్నీ ఆడాడు. శిఖర్ ధావన్ తన కెరీర్‌లో మొత్తం 24 సెంచరీలు చేశాడు. దాంట్లో 17 వన్డేల్లో, ఏడు టెస్టుల్లో చేశాడు. తన కెరీర్‌లోని క్రికెట్ అధ్యాయాన్ని ముగిస్తున్నట్లు ఎక్స్ అకౌంట్‌లో ధావన్ వెల్లడించాడు. రిటైర్మెంట్ ప్రకటిస్తూ ఓ వీడియోను పోస్టు చేశాడు. ఎన్నో జ్ఞాపకాలను మోసుకెళ్తున్నట్లు చెప్పారు. మీ ప్రేమ, అభిమానానికి థ్యాంక్స్ అంటూ ఆ వీడియోలో తెలిపాడు.గుండెల్లో శాంతిని నింపుకుని.. క్రికెట్‌కు అల్విదా చెబుతున్నట్లు ధావన్ తెలిపాడు. ఇండియాకు చాలా సుదీర్ఘ కాలం క్రికెట్ ఆడినట్లు వెల్లడించారు. ఇక ఇండియాకు ఆడబోమన్న బాధ అవసరం లేదన్నారు. దేశానికి ఆడినందుకు సంతోషంగా ఫీలవుతున్నట్లు చెప్పారు. శిఖర్ ధావన్‌కు వన్డేల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్నది. 40 ప్లస్ సగటుతో.. 90 ప్లస్ స్ట్రయిక్ రేట్‌తో.. వన్డేల్లో 5వేల పరుగులు చేసిన 8 మంది బ్యాటర్లలో అతను ఒకడిగా నిలిచాడు. ఈ జాబితాలో ఇండియా నుంచి రోహిత్, కోహ్లీ మాత్రమే ఉన్నారు. ఇండియా తరపున శిఖర్ ధావన్ చివరిసారి డిసెంబర్ 2022లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడాడు. తన కెరీర్‌లో ఇండియా తరపున 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టీ20లు ఆడాడు ధావన్. టెస్టుల్లో 2315, వన్డేల్లో 6793, టీ20ల్లో 1759 రన్స్ చేశాడతను.అంతర్జాతీయ క్రికెట్, డొమెస్టిక్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధావన్.. ఐపీఎల్‌పై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అతడు ఐపీఎల్ ఆడతాడని అంతా భావిస్తున్నారు.గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున ధావన్ బరిలోకి దిగాడు. మొత్తంగా తన కెరీర్‌లో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, దక్కన్ ఛార్జర్స్ (ఇప్పుడు సన్ రైజర్స్ హైదరాబాద్), సన్ రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల తరఫున ఆడాడు.ఇక టీమిండియా తరపున ధావన్ చివరగా.. 2022లో ఆడాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డేనే తన కెరీర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్. కాగా ధావన్.. తన కెరీర్ చివర్లో.. టీమిండియా ద్వితీయ శ్రేణి జట్టుకు నాయకత్వం వహించాడు. కుర్రాళ్లతో కూడిన జట్టును నడిపించాడు. జట్టును విజేతగా నిలిపాడు. తన కెరీర్‌లో ఎక్కువగా రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన గబ్బర్.. టీమిండియాకు ఎన్నో మరిచిపోని విజయాలు అందించాడు.. సో హ్యాపీ రిటైర్మెంట్ గబ్బర్..

శిఖర్ ధావన్ కెరీర్‌లో ఐదు పెద్ద రికార్డులు

38 ఏళ్ల శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ మరియు దేశవాళీ క్రికెట్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాను. అతను తన కెరీర్‌లో అద్భుతంగా ఆడాడు మరియు మూడు ఫార్మాట్లలో 24 సెంచరీల సహాయంతో భారతదేశం కోసం 10 వేలకు పైగా పరుగులు సాధించగలిగాడు. ధావన్ మళ్లీ భారత జెర్సీలో కనిపించడు, కానీ అతను తన కెరీర్‌లో కొన్ని గొప్ప విజయాలు సాధించాడు. కాబట్టి శిఖర్ ధావన్ అంతర్జాతీయ కెరీర్‌లో 5 అతిపెద్ద విజయాల గురించి మీకు తెలియజేద్దాం. భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ తన అరంగేట్రం టెస్ట్ మ్యాచ్‌లో చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడాడు. 2013లో మొహాలీలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో రికార్డు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో శిఖర్ ధావన్ 174 బంతుల్లో 33 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 187 పరుగులు చేశాడు. అతను ఖచ్చితంగా డబుల్ సెంచరీని కోల్పోయాడు, కానీ భారతదేశం తరపున అరంగేట్రం టెస్ట్ మ్యాచ్‌లో అత్యధిక స్కోరు చేసిన బ్యాట్స్‌మన్ అయ్యాడు. అతని ఈ రికార్డు ఇప్పటి వరకు చెక్కుచెదరకుండా ఉంది.టీమ్ ఇండియా లెజెండరీ బ్యాట్స్‌మెన్ శిఖర్ ధావన్‌ను మిస్టర్ ఐసిసిగా పరిగణించారు. ఐసీసీ ఈవెంట్లలో అద్భుత ప్రదర్శన చేశాడు. ముఖ్యంగా గబ్బర్‌గా పేరొందిన ఈ బ్యాట్స్‌మెన్ ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్‌లో వరుసగా రెండు సార్లు గోల్డెన్ బ్యాట్ అవార్డును గెలుచుకోవడంలో అతను విజయం సాధించాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేశాడు. ధావన్ 5 మ్యాచ్‌ల్లో 5 ఇన్నింగ్స్‌ల్లో 90.75 సగటుతో 363 పరుగులు చేశాడు. దీని తర్వాత, ఈ బ్యాట్స్‌మన్ 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా అత్యధిక పరుగులు చేశాడు. అతను 5 మ్యాచ్‌ల్లో 67.60 అద్భుతమైన సగటుతో 338 పరుగులు చేశాడు. రెండు సార్లు గోల్డెన్ బ్యాట్ అవార్డును గెలుచుకోవడంలో విజయం సాధించాడు.



## ఐపీఎల్‌లో ధవన్ హిస్టరీ

క్రికెట్ అభిమానులు ముద్దుగా గబ్బర్ అని పిలుచుకునే శిఖర్ ధవన్ అంతర్జాతీయ, డొమెస్టిక్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన ఆటను ఇకపై ఐపీఎల్‌లోనే చూసే అవకాశం ఉంది. IPLలో ఇప్పటివరకూ 222 మ్యాచులు ఆడిన శిఖర్ రెండు సెంచరీలు, 51 అర్ధ సెంచరీలతో 6769 రన్స్ చేశారు. ఈ ఫార్మాట్‌లో 768 బౌండరీలు, 152 సిక్సులు బాది 102 క్యాచ్‌లు పట్టుకున్నారు. IPLలో అత్యధిక పరుగులు చేసిన రెండో ప్లేయర్ ఈయనే.

## ఐసీసీ టోర్నమెంట్లలో విశ్వరూపమే..

శిఖర్ ధవన్‌కు ఐసీసీ వన్డే టోర్నమెంట్లలో అదిరిపోయే రికార్డులు ఉన్నాయి. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ, 2015 వన్డే వరల్డ్ కప్, 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరపున అత్యధిక పరుగులు ఇతడివే. మొత్తం 20 ఇన్నింగ్స్‌ల్లో 1238 రన్స్ చేశారు. సగటు 65, స్ట్రైక్ రేట్ 98గా ఉంది. అందులో 6 సెంచరీలు, 4 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.




## సపోర్ట్ చేసిన ధోనీకి థాంక్స్: ధవన్

తాను ఫామ్‌లో లేనప్పుడు మద్దతుగా నిలిచిన అప్పటి కెప్టెన్ ధోనీకి ధవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీలో ధవన్‌కు మద్దతుగా ధోనీ నిలువగా ఆయన హయ్యెస్ట్ రన్ స్కోరర్‌గా నిలిచారు. 2014, 2016 టీ20 వరల్డ్ కప్‌లలో ఆయనకు టీమ్-11లో చోటు దక్కలేదు. కానీ, 2015 ప్రపంచ కప్‌లో ఆయనకు ధోనీ ఛాన్స్ ఇవ్వడంతో భారత్ తరపున అత్యధిక పరుగులు చేశారు. విరాట్ కోహ్లీ, రోహిత్ కెప్టెన్సీలోనూ శిఖర్ ఆడిన విషయం తెలిసిందే.




## శిఖర్ ధవన్ రికార్డులు

- అంతర్జాతీయ క్రికెట్లో 10867 రన్స్
- భారత్ తరపున అత్యధిక రన్స్ చేసిన 12వ ప్లేయర్
- 24 సెంచరీలు, 79 50+ స్కోర్స్
- 2018 ఆసియా కప్‌లో అత్యధిక రన్స్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్
- (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో సెంచరీ చేసిన ఏకైక భారత ఓపెనర్
- ఐసీసీ వన్డే టోర్నమెంట్లలో అత్యధిక యావరేజ్





## రోహిత్ శర్మ కోసం రూ.50 కోట్లు?

ముంబై మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కోసం ఢిల్లీ, లక్నో పోటీ పడుతున్నాయని వార్తలొస్తున్నాయి. ఒకవేళ రోహిత్ ముంబైని వదిలేసి వేలంలోకి వస్తే రూ.50 కోట్లకు దక్కించుకునేందుకు ప్లాన్ చేస్తున్నాయని సమాచారం. ఇందుకోసం ఆ రెండు ఫ్రాంచైజీలు రూ.50 కోట్ల పర్స్ మనీని సేవ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు టీంలకు ఇప్పటివరకు ఐపీఎల్ ట్రోఫీ దక్కలేదు. దీంతో ఎలాగైనా హిట్‌మ్యాన్‌ను తీసుకోవాలని భావిస్తున్నాయని టాక్.

## ప్రజల దృష్టిని మరల్చేందుకు హై'డ్రామా':బీఆర్ఎస్

రైతు రుణమాఫీ, ఇతర సమస్యలపై ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి 'హైడ్రా' నాటకానికి తెరలేపారని BRS విమర్శిస్తోంది. చెరువుల స్థలాల్లో నిర్మించిన మంత్రులు, కాంగ్రెస్ నేతల ఇళ్లను, ఫామ్ హౌస్‌లను కూల్చేస్తారా? అని ఆ పార్టీ నేతలు నిలదీస్తున్నారు. ఇవాళ కూల్చిన నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లోనే 2015లో రేవంత్ రెడ్డి తన కూతురి ఎంగేజ్‌మెంట్ జరిపారని గుర్తు చేస్తున్నారు.



## మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్!

మెట్రోస్టేషన్ల వద్ద పెయిడ్ పార్కింగ్ అమలు చేయడంపై మెట్రో అధికారులు మరోసారి వెనక్కి తగ్గారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు పెయిడ్ పార్కింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్ల వద్ద ఫ్రీ పార్కింగ్ సదుపాయం పునరుద్ధరించాలని రేపు నాగోల్‌లో ప్రయాణికులు మహాధర్నా చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



## సీఎం రేవంత్ రెడ్డి దూకుడు!


న్నో ఏళ్లుగా ప్రభుత్వాలు పట్టించుకోని సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి పరిష్కరిస్తున్నారని నెటిజన్లు అభినందిస్తున్నారు. చెరువులను కబ్జా చేసి నిర్మించిన భవంతులను హైడ్రా ద్వారా కూల్చేస్తున్నారని చెబుతున్నారు. యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్, గంజాయి ఆటకట్టిస్తున్నారని, వాటిపై యుద్ధం చేస్తున్నారని కొనియాడుతున్నారు. ఇక నాణ్యత లేని ఆహారం తయారు చేస్తున్న హోటళ్లపై రైడ్లు చేస్తున్నారంటున్నారు.

## 20 ఏళ్ల తర్వాత ఒక్కటైన తండ్రీకొడుకులు!

తండ్రీకొడుకులు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అమృత్‌సర్‌లో ఉండే సుఖ్‌పాల్ సింగ్ జపనీయురాలిని పెళ్లాడి కొడుకు పుట్టాక విడిపోయారు. సింగ్ మరో పెళ్లి చేసుకోగా కూతురు జన్మించింది. అయితే, తన తండ్రి ఎలా ఉంటారో చూడాలని 21 ఏళ్ల రిన్ తకహాతా అమృత్‌సర్‌కు వచ్చారు. చాలా చోట్ల వెతకగా ఇంటి జాడ దొరికింది. కొడుకు రావడంతో తండ్రి ఎంతో సంతోషపడ్డారు. రక్షాబంధన్ రోజు రావడంతో సింగ్ కూతురు తన సోదరుడికి రాఖీ కట్టింది.

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM





# ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్పందించిన నాగార్జున

## చట్టవిరుద్ధ చర్యలపై కోర్టును ఆశ్రయిస్తాం

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హీరో నాగార్జున స్పందించారు. కోర్టు కేసులకు విరుద్ధంగా కన్వెన్షన్ కూల్చివేదలు బాధాకరమన్నారు. అధికారులు చట్టవిరుద్ధంగా చేసిన చర్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్పష్టం చేశారు. ఉదయం కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని చెప్పారు. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదన్నారు. తప్పుడు సమాచారంతో చట్టవిరుద్ధంగా కన్వెన్షన్‌ను కూల్చివేశారని చెప్పారు. తాను చట్టాన్ని గౌరవించే పౌరుడినని తెలిపారు. కోర్టు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే తానే కూల్చివేతను నిర్వహించేవాడినని ఎక్స్ వేదికగా వెల్లడించారు.'స్టే ఆర్డర్‌లు మరియు కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి కూల్చివేతలు చేపట్టడం బాధాకరం. మా ప్రతిష్టను కాపాడటం కోసం, కొన్ని వాస్తవాలను తెలియజేయడం కోసం మరియు చట్టాన్ని ఉల్లంఘించేలా మేము ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలుపుట కొరకు ఈ ప్రకటనను జారీ చేయడం సరైనదని నేను భావించాను. ఆ భూమి పట్టా భూమి. ఒక్క అంగుళం ట్యాంక్ ప్లాన్ కూడా ఆక్రమణకు గురికాలేదు. ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనమిది. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై స్టే కూడా మంజూరు చేయబడింది. స్పష్టంగా చెప్పాలంటే, కూల్చివేత తప్పుడు సమాచారంతో లేదా చట్ట విరుద్ధంగా జరిగింది. ఈరోజు ఉదయం కూల్చివేతకు ముందు మాకు ఎలాంటి నోటీసు జారీ చేయలేదు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలా చేయడం సరికాదు. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా, కోర్టు నాకు వ్యతిరేకంగా తీర్పునిస్తే, కూల్చివేత నేనే నిర్వహించి ఉండేవాడిని. తాజా పరిణామాల వల్ల, మేము ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశముంది. ఆ అభిప్రాయాన్ని పోగొట్టాలనేదే మా ప్రధాన ఉద్దేశం. అధికారులు చేసిన ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా మేము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అక్కడ మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ట్వీట్ చేశారు.





### మోదీ, యోగిని ప్రశంసించిన ముస్లిం మహిళ..

# ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్త

ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ఒక ముస్లిం మహిళ ప్రశంసించింది. దీనిపై ఆగ్రహించిన ఆమె భర్త ట్రిపుల్ తలాక్ చెప్పి (triple talaq) విడాకులు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మొహల్లా సరాయ్ ప్రాంతానికి చెందిన ముస్లిం మహిళకు గత ఏడాది డిసెంబర్ 13న అయోధ్యలోని మొహల్లా ఢిల్లీ దర్వాజా ప్రాంతానికి చెందిన అర్షద్‌తో వివాహం జరిగింది. కాగా, పెళ్లి తర్వాత అయోధ్యలోని అత్తవారింటికి చేరుకున్న ఆ ముస్లిం మహిళకు అక్కడి రోడ్లు, సుందరీకరణ, అభివృద్ధి, వాతావరణం ఎంతో నచ్చాయి. దీంతో భర్త ముందు సీఎం యోగి, ప్రధాని మోదీని ఆమె ప్రశంసించింది. ఆగ్రహించిన భర్త అర్షద్ భార్యను కొట్టడంతోపాటు కాలుతున్న పాన్‌ను ఆమెపై విసిరాడు. అలాగే భార్యను పుట్టింటికి పంపేశాడు. మరోవైపు కొన్ని రోజుల తర్వాత బంధువుల జోక్యంతో ఆ మహిళ తిరిగి అయోధ్యలోని భర్త ఇంటికి చేరుకున్నది. అనంతరం భర్త తనను కొట్టడంతోపాటు మోదీ, యోగిని ప్రశంసించినందుకు తిట్టి ట్రిపుల్ తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడని ఆ మహిళ ఆరోపించింది. భర్తతో పాటు అత్తింటి వారు కూడా తనను వేధించి చిత్రహింసలకు గరిచేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో అర్షద్, అతడి కుటుంబ సభ్యులతో సహా 8 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




### జర్మనీలో జనంపై కత్తితో దాడి..

# ముగ్గురు మృతి

జర్మనీలోని సోలింజన్ నగరంలో వేడుక జరుగుతున్న సమయంలో.. ఓ ఉన్మాది తన వద్ద ఉన్న కత్తితో విచక్షణారహితంగా అటాక్ చేశాడు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం సిటీ సెంటర్‌లో ఓ ఫెస్టివల్ జరుగుతున్న సమయంలో ఆ దాడి జరిగింది. దాడికి పాల్పడిన ఉన్మాది ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతన్ని పట్టుకునేందుకు హెలికాప్టర్లతో గాలిస్తున్నారు. పారిశ్రామిక నగరమైన సొలింజన్‌లో 650వ వార్షిక ఉత్సవాలు జరుగుతున్నాయి. నిందితుడు కావాలనే బాధితుల మెడపై దాడి చేసినట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్ష్యుల ప్రకారం ఒక్కడే ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోందని పోలీసు ప్రతినిధి అలెగ్జాండర్ క్రెస్టా తెలిపారు. అతని ఆచూకీ చిక్కడం లేదన్నారు. ఫ్రాన్‌హాఫ్ మార్కెట్ ఏరియాను వదిలి వెళ్లాలని ప్రజల్ని పోలీసులు కోరారు. సెక్యూర్టీ కార్డన్ ఏర్పాటు చేశారు. గాయపడ్డవారికి ఎమర్జెన్సీ సిబ్బంది చికిత్స అందిస్తోంది. ఉన్మాదిని పట్టుకునేందుకు 40 వాహనాలను రంగంలోకి దింపారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కూడా వేట మొదలుపెట్టారు.

## ఫ్రెంచ్ ఫ్రైస్ తినకూడదన్న భర్త గృహ హింస కేసు పెట్టిన భార్య..!

కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ జంటకు ఇటీవలే బిడ్డ జన్మించింది. దాంతో కాన్పు తర్వాత భార్య ఆరోగ్యం విషయంలో భర్త పలు జాగ్రత్తలు తీసుకున్నాడు. అందులో భాగంగా పౌష్టికాహారం మాత్రమే తీసుకోవాలని భార్యకు సూచించాడు. ఆరోగ్యానికి మేలు చేసేది ఏది అడిగినా తెచ్చి ఇచ్చాడు. ఈ క్రమంలో భార్య తనకు ఫ్రెంచ్ ఫ్రైస్ తినాలని ఉందని చెప్పింది. బాలింతరాలు కావడంతో జంక్ ఫుడ్ వద్దని భర్త అభ్యంతరం చెప్పాడు. దాంతో ఆగ్రహానికి లోనైన భార్య నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్తపై గృహ హింస కేసు పెట్టింది. తన భర్త తనను ఫ్రెంచ్ ఫ్రైస్ తిననివ్వడంలేదని, ఇది గృహహింస కిందికే వస్తుందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సదరు భర్తను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. విషయం తెలుసుకుని ఇద్దరికీ రాజీ చేసేందుకు పోలీసులు ప్రయత్నించినా భార్య వినిపించుకోలేదు. దాంతో ఆమె భర్త హైకోర్టును ఆశ్రయించాడు.



## సెన్సార్ కంప్లీట్ చేసుకున్న సరిపోదా శనివారం

నాని కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తుండగా.. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. తమిళ నటుడు ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వరుసగా మూవీ ప్రమోషన్స్ చేస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నట్లు నాని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. ఈ సందర్భంగా ఒక వీడియోను కూడా వదిలాడు. 'సరిపోదా శనివారం' సెన్సార్ కంప్లీట్ అయ్యింది. సెన్సార్ బోర్డ్ U/A సర్టిఫికెట్ ఇచ్చింది. అలాగే 2 గంటల 35 నిమిషాలు రన్ టైం అని నాని చెప్పగా.. వెనక నుంచి ఎస్‌జే సూర్య వచ్చి ప్లస్ 15 మినిట్స్ అంటాడు. మొత్తం 2 గంటల 50 నిమిషాలు అంటే సుందరానికి కూడా ఇదే రన్ టైం కదా అంటూ ఎస్‌జే సూర్య అనగా.. అంటే కాదు.. 'సరిపోదా శనివారం' అంటూ నాని అనడం ఇది ఒక యాక్షన్ మూవీ అండ్ లవ్ స్టోరీ అంటూ వీడియోను వదిలారు.




### 'ఆగ్రా' సినిమా బోల్డ్ సీన్స్ లీక్..

## ఎమోషనల్ నోట్ పెట్టిన

# రుహాణి శర్మ

'చిలసౌ', 'హిట్' చిత్రాల ఫేమ్ టాలీవుడ్ నటి రుహానీ శర్మ నటించిన అవార్డు విన్నింగ్ చిత్రం ఆగ్రా. అంతర్జాతీయ అవార్డులతో పలు వివాదలు ఎదుర్కొన్న ఈ చిత్రం ఇండియాలో కాకుండా ప్రపంచవ్యాప్తంగా 2023లో విడుదలై ప్రేక్షకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో స్పెషల్ అప్లాజ్ అందుకుంది. అయితే ఈ చిత్రం ఎప్పుడు ఓటీటీకి వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే.మా కష్టాన్ని, కన్నీళ్లను అర్థం చేసుకోకుండా కొందరు దానిగురించి తప్పుగా మాట్లాడుతున్నారు. ఆగ్రా కేవలం ఒక చిత్రం కాదు. ఈ చిత్రాన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2023లో ప్రదర్శించారు. అది మా యూనిట్ కు దక్కిన గౌరవం. ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకోవడమే కాకుండా అనేక అవార్డులను గెలుచుకుంది. ఇంత గొప్ప సినిమాలో నటించినందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఈ సినిమా శైలిని అందరూ గుర్తించాలని కోరుతున్నాను. కళ ఎప్పుడూ సులభంగా, సౌకర్యవంతంగా ఉండదు. ఎన్నో భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది. కళాకారుల శ్రమను వృథా చేయకండి.

